


# పల్లెటూళ్ళో పేపరువార్త

ఉపాధ్యాయుల గౌరీశంకరరావు




మన రాష్ట్రంలో విజయనగరం జిల్లా వెనుకబడినదైతే అందులో మా ఊరు మరీ వెనుకబడినదని చెప్పవచ్చు. మా ఊరు వెళ్ళాలంటే ఏ వక్క బస్సు దిగినా మూడు, నాలుగు మైళ్ళు నడవవలసిందే. వర్షాకాలంలో ఏరు, గడ్డలు దాటవలసిందే. ప్రపంచ నాగరికత ఏమాత్రం ఆ మారుమూల పల్లెటూళ్ళో ప్రవేశించలేదని చెప్పవచ్చు.

ఈమధ్యే మా ఊళ్ళో కరెంటు ప్రవేశించింది. వీధిలో బుడ్డీలు [మా ఊరి వాళ్ళు బల్బులకు పెట్టిన పేరు] వెలగగానే జనాలు సంబరాలు చేసుకొన్నారు. పట్నం ఎరుగని ముసలివారు "ఇదేం చోద్యమో?" అని ఆశ్చర్యపోయారు. "నీటినుంచి పుట్టిన నిప్పు" - అని తత్త్వవేత్తలు వ్యాఖ్యానించారు. "అంత తెల్లోడి మాయ" అని కొందరు నిశ్వసించారు.

తరువాత ఒకటీ ఒకటీ మా ఊళ్ళో ప్రవేశించాయి. బెల్‌బాటం పాంట్లు, హిప్పీ జుత్తులు, వాచీలు, రేడియోలు వచ్చాయి. అయితే నవనాగరిక ప్రపంచంలో విస్తృత ప్రచారం కలిగిన టీ.వీ., ఫ్రిజ్ మొదలైనవి మా ఊరు రాలేదు. ఒక విధంగా ఆ విషయంలో మేం చాలా విచారించాం.

అయితే మా ఊరి లోటు తీర్చడానికా అన్నట్లుగా నాయుడుగారి పట్నం అబ్బాయికి పెళ్ళి కుదిరింది. ఆకాశమంత పందిరి, భూమంత పీట వేసి పెళ్ళి జరిగింది. వచ్చిన పట్నం పిల్ల తెచ్చిన 'సారె'ను మా ఊరి వారంత నోరెళ్ళబెట్టుకొని ఆశ్చర్యంగా చూశారు.

డబుల్ కాట్, ఇనుప బీరువాలు, రకరకాల స్టీలు పాత్రలు, టీ.వీ., గ్యాసు స్టవ్వు, కుక్కరు, మిక్సీ మొదలైన అపూర్వమైన, వింతయిన సామాన్లను గురించి మా ఊరి జనం చాలా 'ఇది'గా చెప్పుకొన్నారు - చాలా రోజులు.

నాయుడుగారి పట్నం అబ్బాయి మా ఊళ్ళోనే కాపురం పెట్టడంతో మా ఊరికి పేపరు కూడా వచ్చింది. సాయంత్రాలు ఊళ్ళో రైతులు చుట్టూ కూర్చుంటే, కళ్ళజోడు సవరించుకుంటూ పేపర్లో వార్తలు చదువుతూ దానిపైన నాయుడుగారు చేసే వ్యాఖ్యానాలు పసందుగా ఉండేవి. ఏతా వతా ప్రపంచ నాగరికతతో మాకు పరిచయం పూర్తయిందనే చెప్పాలి.

అలాంటిది వేసవికాలంలో ఒక రాత్రి అలవాటు ప్రకారం పవర్ కట్‌తో రాష్ట్రం గిలగిల లాడుతున్న చీకటి సమయం. పల్లెటూరు పశువుల కొట్టాలలో పాల శబ్దాలు మార్మోగుతున్న సమయంలో నాయుడిగారి మేడనుంచి అరుపులు, కేకలు వినవస్తున్నాయి. పిల్లా జల్లలతో నాయుడుగారు వీధిలో కొచ్చి గగ్గోలు పెడుతున్నారు. ఒక్కరొక్కరుగా ఊరి జనాలంతా నాయుడిగారి మేడ చుట్టూ మూగుతున్నారు.

"అమ్మో ! నాయనోయ్ ! పేపర్లో రోజు కనిపిస్తున్న ఘోరాలు మన ఊళ్ళో కొచ్చేశాయోయ్ ఇప్పు డెలాగ(్రోయ్? నే నెంతో కష్టపడి చెమటోడ్చి పైసా పైసా కూడబెట్టి కట్టుకొన్న అందమైన మేడరోయ్ ... ! ఈ సమయంలో నా కొడుకయినా లేడ(్రోయ్. నేనేం చేతునోయ్ దేముడా?" నాయుడుగారు భయవిహ్వలతతో అరుస్తున్న అరుపులు ఊరంత ప్రతిధ్వనిస్తున్నాయి. కారణం తెలియకుండానే ఆడవాళ్ళు శ్రుతి కలుపుతూ రాగాలాపన చేస్తున్నారు.

"ఏటండీ బాబూ ! నాయుడుగారూ, ఇప్పు డేటయింది? పేపర్లో గోరా లంతున్నారు. మే డంటున్నారు? మా కే టప్పం కాటన్నేదు. కొంచెం ఇవరంగా సెప్పండి."

"ఏటి సెప్పమంత వురా నాయనా ! నా నొద్దంటే ఆ ముసిలిదాయి ఇన్లేదు. గాసుమీ దొండింది.

అది ఇప్పుడు లీకయిపోతోంది. అది కాలిపోద్ది. నా మేడ కూలిపోద్ది. నానేం చేద్దునురా దేముడా !" నాయుడిగారి ముఖంలో విషాద మేఘాలు తారాట్లాడుతున్నాయి. అంతవరకూ వారిలో కొట్టొచ్చినట్లు కనిపించిన గాంభీర్యం దిగజారిపోతోంది.

"ఆ తుంబలో [సిలెండర్‌లో] గాలి పోయినంత మాత్రాన ఏటవుద్దండి. మళ్ళా గాలి తుంబ మరోహటి కొనొచ్చులెండి. దాని కింత ఇదైపోవడం ఏంది?" ఎవరో అన్న మాటలకు చర్రున లేచారు నాయుడుగారు.

"ఓరోరి నీ కేదో సిన్న ఇసయంలా కనిపిద్దురా నాయనా? తుంబలో గాలి పోద్దని నేను బాదపడ్డం నేదురా నాయనా ! ఆ గాలి చేసే పెమాదం గూర్సే నా బాదంతా ! ఏమాత్రం అగ్గిసురుకు తగిలించంటే స్టవ్వు పేలిపోయి మేడ కూలిపోద్దిరా. ఒక్కపాలి అంతా మంటలు నేసిపోతాయిరా ! ఇలపింటికి రోజు కోపాలి జరుగుతున్నట్లు పేపర్లో రాత్తన్నారా !"

"ఓలమ్మో... సంపేసినాడేయ్ దేముడా ! ఢబ్బునోళ్ళ కేటొచ్చినా బాదనేదు గాని. మా లాంటోళ్ళ కొత్తే మా మేటి సేయాలి దేముడా ! నాయుడి మేడ పడిపోతే పడిపోనీయ్ మా ఇంటికీ దెబ్బ లేకుండా సూతరా దేముడా..." నాయుడుగారి ఇరుగు పొరుగు అమ్మలక్కలు ఒక్కపెట్టున శోకాలు ప్రారంభించారు.

మేడ పేలిపోతుం దనగానే గుమికూడిన జనం చిత్రాతిపైని కుంత పెంకుల్లా చెదిరిపోయారు. కొందరు యువకులు లేని కరెంటు అదే సమయంలో వచ్చి ఏ బీభత్సం సృష్టిస్తుందో అని ట్రాన్స్ఫార్మర్ ఆపుచేశారు. ఇరుగు పొరుగు ఇళ్ళలో విలువైన వస్తువుల్ని బయటకు చేరవేస్తున్నారు. ముందుచూపు గలవారు మంట లార్పడానికి నీటికోసం ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు.

"కలికాలం కాకపోతే గాలితో వంటలు చేయడమేంటి? ఆ గాలి బయట కొచ్చి ఇల్లు, మేడలు కూల్చడమేటి? కర్రల మీ దొండిన రుచి గాలిమీ దొస్తుందా? వాటివల్ల ఇలపింటి పెమాదాలు ఎరుగుదుమా? వద్దర్రా అంటే మన మాట ఎవ్వరైనా ఇంటారా... ! ఏటో... అంత కలిమాయ..." నిట్టూర్చారు వృద్ధులు.

గోడవార చెవి ఆనించి జాగ్రత్తగా వింటే వంట గదిలోనుంచి స్సస్స్... స్సస్స్" అనే శబ్దం వస్తోంది. ధైర్యం చేసి ముందుకు ఎవ్వరూ వెళ్ళలేకపోతున్నారు. ఏం చేయాలో కూడా ఎవ్వరికీ తెలియటం లేదు.

"పొయ్యికీ, తుంబకీ మద్దె గొట్టాం పీకేసి తుంబని బయట పడేత్తే..." అరిచాడు సింహాచలం. అందరూ తలతిప్పి ఒక్కమారు అతని వంక చూశారు.


ఒళ్ళల్లా కండలు తిరిగి పొట్టిగా, నల్లగా ఉన్న సింహాచలం నాయుడుగారి కళ్ళకు దేముడిలా కనిపించాడు.

"ఒరేయ్ నాయినా... నువ్వు సానా తెలివయిన ఐడియా ఇచ్చినావురా ! మా గొప్పగా ఆలోసించినావురా ! ఎంతయినా అప్పయ్య - కొడుకు వనిపించుకొన్నావురా ! మీ అయ్య చచ్చి ఏ నర్గా న్నున్నాడోగాని ఊరందరికీ ఎన్నుపకారాలు సేసేడంటావు. ఏటో... మంచోళ్ళకే సావు ఏరం వత్తాది. బాబ్బాబూ, అదేదే ఆ ఉపకారం సేసిపెడుదూ... నానే కాదు బతికున్నంత కాలం ఈ ఊరంతా నీ పేరు సెప్పుకుంటాది." నాయుడుగారు సింహాచలాన్ని బ్రతిమాలుతున్నారు.

నాయుడుగా రంతటి వ బున్నవాడు, ఊళ్ళో గొప్పోడు తనను బ్రతిమాలడంతో, సింహాచలం భుజాలు గజాలై ఒళ్ళు పొంగి మెరిసే కళ్ళతో చుట్టూ చూసి, వంటింట్లో దూరాడు. సింహాచలం నాయుడిగా రింట్లో దూరాడన్న విషయం క్షణాల్లో ఊరంతా ప్రాకింది. సింహాచలం తల్లి లబోదిబో మంటూ రాగాలు తీస్తూ పరుగు పరుగున చేరుకొంది.

పద్మవ్యూహంలో ప్రవేసించిన అభిమన్యుడిలా ఒక్క ఉదుటున వంట గదిలో ప్రవేశించాడు సింహాచలం. రకరకాల పాత్రలతో అందంగా అలంకరించిన వంట గది అతనికి ఆశ్చర్యం కలిగించింది. ఎత్తుగా సిమ్మెంటు దిమ్మమీద గ్యాసు పొయ్యి. దానిపైన ఆవిర్లు చిమ్ముతున్న కుక్కరు. పక్కగా ఎర్రని గాలితుంబ, పొయ్యిని కలుపుతూ సన్నని రబ్బరుగొట్టం అతనికి కనిపించాయి.

ఒక్క ఉదుటున రబ్బరుగొట్టం పట్టుకుని




లాగాడు సింహాచలం. గాలితుంబని దొర్లించుకుంటూ ద్వారం ముందుకు వచ్చి, దాన్ని ఎత్తి పెరటిలో విసిరాడు. అంతవరకూ ఏమవుతుందా అని కుతూహలంతో ఎదురుచూస్తున్న వారంతా "అమ్మయ్య !" అనుకొన్నారు. ఏదో పెద్ద గండం గడిచినట్లు ఫీలయ్యారు నాయుడుగారు.

గ్యాసు సిలెండరు చుట్టూ మూగి గేలగేలగా మాట్లాడుకొంటున్నారు జనాలు. సింహాచలాన్ని మందలిస్తూ ఇంటికి తీసుకుపోతోంది అతని తల్లి.

"ఓరయ్యో ! గదిలోంచి ఇంకా బుస్ బుస్స్ మంతందిరా !" చెవి ఒగ్గి విన్న కుర్రా డొకడు కేకవేశాడు. అంతవరకు గేలగేలగా మాట్లాడుకుంటున్నవారు చప్పున నోరు మూశారు. సూది పడితే వినిపించేంత నిశ్శబ్దం ఆవరించింది అక్కడ.

"స్సస్సస్... స్సస్సస్" గదిలో నుంచి స్పష్టంగా వినిపిస్తోంది. తెల్లబోయి ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు జనాలు.

"ఓలమ్మో... ఫాము గావాల." ఎవరో సందేహం వెలిబుచ్చారు.

"నాయుడిగా రింట్లో ఎంత పామో !" ఊరంతా దావానంలా వ్యాపించింది ఆ మాట.

పామును కొట్టగలిగే మగాళ్ళంతా దుడ్డుకర్రలు చేతబట్టి రంగంలో దిగారు. కటిక చీకటిలో పాము ఏ మూలనుందో ఎవరూ ధైర్యం చేయలేకపోతున్నారు.

టార్చి లైట్లు, లాంతర్లు, సీసా దీపాలు రంగంలో దిగాయి. వెలుగులు జిమ్ముతూ పామును పట్టడానికి ప్రయత్నం చేస్తున్నాయి. జంకుతూ జంకుతూనే యువకులు కర్రలతో గది నాలుగు మూలలా పొడుస్తున్నారు. 'స్సస్సస్స... స్సస్స' అని శబ్దం వినిపిస్తూనే ఉంది. కానీ పాము కనిపించడంలేదు.

ట్రాన్స్ఫారం దగ్గర ఫీజులు పెట్టిన పావుగంటకే కరెంటు వచ్చింది. ఊరంతా దీపాలు గుప్పున వెలిగాయి. ఒళ్ళల్లా కళ్ళు చేసుకొని పాము కోసం గాలిస్తున్నారు. పాము కనిపించడం లేదు.

పాము కోసం వెతుకులాడుతున్న యువకుడు గ్యాసు పొయ్యిని సమీపించాడు. పొయ్యిపైన కుక్కరు వేడిగా, నిండుగా ఉంది. ఆవిరి విజల్ గుండా సన్నగా వస్తోంది. స్స్స్స్ సన్నని శబ్దం వెలువడుతోంది.

ఆ యువకుడు ఆనందంగా కేకవేశాడు. ముడివీడని పాము సమస్యని విడమరిచి చెప్పాడు.

"ఓలమ్మ నిజమేనే ! ఆ కుక్కర్లో నీళ్ళోసి వండితే ఈలలు కొట్టిందే ! అప్పుడు పొయ్యి ఆర్పేసినానే. దాంతలుకా ఆవిరే ఇంకా సన్నగా వత్తందే. ఓపాలి ఏ టా సప్పుడంటే ఆవిరని మా కోడలు ఇవరించిందే. ఓలమ్మ నానే మర్సిపోనానే"

నాయుడిగారి భార్య తోటి అమ్మలక్కలకు వివరిస్తోంది.

"మంచి సబ్దమే... ఓరాయన ఎంత గాబరా పెట్టేసిందే !" ఒక్కొక్కరు చల్లగా ఇళ్లకి జారుకొంటున్నారు. ★